సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 20 | జనవరి | 2023



'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్

వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. రెండో రాజధాని నాలుగు కంపెనీలకే పరిమితమైంది. - 8లో▸



గంజాయి ముఠా గుట్టురట్టు

ఛత్తీస్‌గఢ్ నుంచి భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$34.4^0/15.9^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు కాస్త చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి



నెహ్రూసెంటర్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేసముద్రం మండలంలోని లాల్‌తండా పరిధి పోడు భూముల కేసులో భాగంగా సీపీఐ నేతలు, పోడుసాగుదారులు గురువారం మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోడు రైతులపై సీఎం కేసీఆర్ స్పందించాలన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. కోర్టుకు హాజరైన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజయ్‌సారథిరెడ్డి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, నాయకులు తోట భిక్షపతి, పోడు రైతులు ఉన్నారు.

'స్పీడ్' గన్ పేలుద్ది..



కురవి: జిల్లాలోని జాతీయ రహదారులపై ఇకనుంచి వాహనాలు అతివేగంగా వెళ్తే స్పీడ్‌గన్ పేలనుంది. మండలంలోని కందికొండ స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాలను సీరోలు పోలీసులు స్పీడ్‌గన్‌తో ఫొటోలు తీస్తూ వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. కాగా గురువారం కానిస్టేబుల్ మహిపాల్ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్‌తో వాహనాలను ఫొటోలు తీశాడు. కాగా 80స్పీడ్ దాటిన వాహనదారులకు రూ.1,000 జరిమానా పడనుంది.

21లోగా అభ్యంతరాలు తెలియజేయాలి

న్యూశాయంపేట: మానుకోట ప్రభుత్వ వైద్యకళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్, థియేటర్ అసిస్టెంట్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించామని, దరఖాస్తుల లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీలోగా తెలియజేయాలని సనా సెక్యూరిటీ అండ్ ప్లేస్‌మెంట్ ఏజెన్సీ బాధ్యులు మహ్మద్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లిస్టును మహబూబాబాద్ జిల్లా అధికారిక వెబ్‌సైట్(మహబూబాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్)లో పొందుపర్చినట్లు వెల్లడించారు. కాగా ఏమైనా అభ్యంతరాలు ఉంటే 99854 56474 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ వాహనాల వేలం



మహబూబాబాద్ రూరల్: మానుకోట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్‌నాయక్ ఆధ్వర్యంలో డీటీఎఫ్ సీఐ కృష్ణ, ఎస్సైలు కృష్ణమూర్తి, హనుమంతరావు, మౌనిక వాహనాల వేలం ప్రక్రియ చేపట్టారు. మొత్తం 59 వాహనాలకు గానూ 57వాహనాల వేలం నిర్వహించారు. అందులో 37స్క్రాప్ వాహనాలకు వేలంపాట ద్వారా రూ2.60లక్షల ఆదాయం సమకూరింది. అలాగే 20 రోడ్డువర్త్ వాహనాలను ప్రజలు రూ.5.25లక్షలకు దక్కించుకున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



గార్ల: కంటివెలుగు పరీక్ష కేంద్రాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం ఆయన గార్లలోని కంటివెలుగు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ రజినిని ఆదేశించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్, ఎంపీపీ శివాజీ చౌహాన్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు' షురూ..

జిల్లాలో 38సెంటర్లలో కార్యక్రమం ప్రారంభం

- తొలిరోజు 6,014మందికి కంటి పరీక్షలు
- 1,378 మందికి కళ్లజోళ్ల అందజేత
- పాఠశాలల్లో కేంద్రాలు.. విద్యార్థుల ఇబ్బందులు



జిల్లా కేంద్రంలోని కంటివెలుగు సెంటర్‌కు వచ్చిన ప్రజలు

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో కంటివెలుగు రెండో విడత కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొర్రూరు మండలం నాంచారిమడూరులో కార్యక్రమం ప్రారంభించగా.. గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్, కురవి మండలాల్లో ప్రారంభించారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్ వారివారి నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమం ప్రారంభించి దగ్గరుండి పలువురికి పరీక్షలు చేయించారు.

మొదటిరోజు 6,014మందికి పరీక్షలు

వారం రోజులుగా కలెక్టర్, వైద్యారోగ్యశాఖ అధికారులు కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కోసం కసరత్తు చేశారు. కావాల్సిన ఏర్పాట్లు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాగా జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 38 సెంటర్లలో వైద్య బృందాలు 6,014మందికి పరీక్షలు చేశారు. ఇందులో1,378మందికి దగ్గరిచూపు లోపం ఉన్నట్లు గుర్తించి రీడింగ్‌గ్లాసులు అందజేశారు. అదేవిధంగా 542మందికి ఇతర దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి వారికి కళ్లజోళ్లు, ఇతర చికిత్స చేయాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

విద్యార్థుల ఇబ్బందులు

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలనే ఆదేశాల మేరకు జిల్లాలోని పలుచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో క్యాంపులు పెట్టారు. దీంతో సంక్రాంతి సెలవులు ముగిసి పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు కంటి వెలుగు సందడితో బోధన ముందుకు సాగలేదు. అదేవిధంగా పలుచోట్ల క్లాసు రూమ్‌లు, కాంపౌండ్‌లో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



కేసముద్రం: నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన..

జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి పీహెచ్‌సీల పరిధిలోని రెండు కంటివెలుగు కేంద్రాల్లో విధులు నిర్వహించే సెకండ్ ఏఎన్‌ఎంలు గురువారం తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. రోజంతా నల్లబ్యాడ్జీలు ధరించే విధులు చేపట్టారు.

మంత్రికి దగ్గరిచూపు లోపం..



కంటి పరీక్ష చేయించుకుంటున్న మంత్రి సత్యవతిరాథోడ్

మంత్రి సత్యవతిరాథోడ్ జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. కాగా ఆమెకు ప్లస్ 2.5షార్ట్‌విజన్ ఉన్నట్లు గుర్తించి రీడింగ్ గ్లాసులు అందజేశారు. కాగా మంత్రి రోజంతా ఆ కళ్లజోళ్లను పెట్టుకుని జిల్లాలో పర్యటించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుకు ప్లస్ 2.0షార్ట్‌విజన్ ఉన్నట్లు గుర్తించి రీడింగ్‌గ్లాసులు అందజేశారు.

నిరుపేదలకు వరం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నాంచారిమడూరులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: నిరుపేదలకు కంటి వెలుగు కార్యక్రమం వరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నాంచారిమడూరు గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదలకు కంటి చూపును ప్రసాదిస్తుందన్నారు. అరవై ఏళ్ల దాటిన వృద్ధులకు కంటి వెలుగు ఒక వరంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,533 కేంద్రాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందుకోసం 1,500 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వంద రోజుల్లో కోటిన్నర మందికి పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందిస్తున్నామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పంజాబ్, ఢిల్లీలో అమలు చేస్తామని ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమన్నారు. అనంతరం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య,జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, సర్పంచ్ గుంటుక యాదలక్ష్మి, ఎంపీటీసీ కుంభం సుకన్యరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల టెండర్లు ఖరారు



ఆలయంలో టెండర్ ఫారాన్ని అందజేస్తున్న కాంట్రాక్టర్

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి నుంచి జరగబోయే బ్రహ్మోత్సవాలకు సంబంధించి పలు టెండర్లను గురువారం ఖరారు చేసినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. వరంగల్‌కు చెందిన మన్న దిలీప్ చలువపందిళ్ల టెండర్ రూ.2.70లక్షలు, క్యూలైన్ బారికేడింగ్ టెండర్ రూ.80వేలు, కల్యాణమండపం వద్ద బారికేడింగ్, ఐరన్‌మెష్‌తో క్యూలైన్ టెండర్లను రూ.1.50లక్షలకు దక్కించుకున్నాడు. వరంగల్‌కు చెందిన కుమార్ విద్యుత్ దీపాలంకరణ టెండర్‌ను రూ.3.73లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే పాల్వంచకు చెందిన అమ్మిరాజు పూల అలంకరణ టెండర్ రూ.1.55లక్షలు, శామియానాలు, కలకత్తా పెండల్స్ రూ.3.60లక్షలు, తెప్పోత్సవం పూలఅలంకరణ టెండర్‌ను రూ.60వేలకు దక్కించుకున్నాడు. కురవికి చెందిన పున్నమయ్య రంగుల వేసే కూలీల చార్జీల టెండర్‌ను రూ.1.55లక్షలకు దక్కించుకున్నాడు. కురవికి చెందిన రవీంద్రాచారి ఎల్‌ఈడీ స్క్రీన్‌తో ప్రత్యక్ష ప్రసార టెండర్ రూ.1.50లక్షలు, గజ్జెల్ల వీరన్న రంగులు, సున్నాల సప్లయ్ టెండర్‌ను రూ.2.77లక్షలకు దక్కించుకున్నారు. వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి తెప్పోత్సవ విద్యుత్‌దీపాలంకరణ టెండర్‌ను రూ.60వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ మహబూబాబాద్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలు మరిపెడకు వన్నె తెచ్చాయి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అభిలాష అభినవ్

- క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలు మరిపెడకు వన్నె తెచ్చాయని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడలోని ఇండోర్ స్టేడియంలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను గురువారం అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..14సంవత్సరాలుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ తన సొంత ఖర్చులతో జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన కోరిక మేరకు మరిపెడలో ఇండోర్ స్టేడియం నిర్మించామని తెలిపారు. అన్ని సదుపాయాలు ఉన్న స్టేడియంలో క్రీడలు విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధిలో దూసుకెళ్తుందని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. అనంతరం ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, రైస్‌మిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, మాజీ ఎంపీపీ వెంకన్న, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, వైద్యాధికారి రవికుమార్, కౌన్సిలర్లు సుజాతవెంకన్న, ప్రగతిశ్రీపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి
- మంత్రి సత్యవతిరాథోడ్



కురవి: అద్దాలు తొడుగుతున్న మంత్రి

మహబూబాబాద్/కురవి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రభుత్వ పాఠశాలలో గురువారం రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మొదటి విడత కార్యక్రమం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం అవసరమైనవారికి కళ్లజోళ్లు అందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలను కేంద్రం కాపీ కొడుతుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ బుజ్జి వెంకన్న, కమిషనర్ ప్రసన్నరాణి. డీఈ సీహెచ్ ఉపేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, ఎస్‌యూఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కురవిలో..

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్యతండా గ్రామ పాఠశాల ఆవరణలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో వంద రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజలు కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అందరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూర్వం గిరిజనులు జొన్నరొట్టెలు ఎక్కువగా తినే వారమని, ఇప్పుడు తగ్గించారని, గిరిజనేతరులు ఇప్పుడు ఎక్కువగా జొన్నరొట్టెలు తింటున్నారని వివరించారు. పౌష్టికాహారం సరిగా లేకపోవడంతో చిన్నప్పుడే కంటి జబ్బులు వస్తున్నాయన్నారు.

భూ సమస్యను పరిష్కరిస్తాం...

గుండ్రాతిమడుగు(విలేజి) రెవెన్యూ పరిధిలోని తాట్యతండా, పిల్లిగుండ్ల తండా, కొత్తూరు(జీ) గ్రామాల్లోని 591 సర్వేనంబర్‌లో 180 ఎకరాలు, 281 సర్వే నంబర్‌లో 150 ఎకరాల్లోని రైతులకు పట్టాలు రాలేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె స్పందించి కలెక్టర్ శశాంకతో మాట్లాడారు. నెల రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి, ఇతర గ్రామాల సర్పంచ్‌లు జీవన్, హరిప్రసాద్, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు అంబరీష, ఉమాగౌరీ, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, ఎన్‌హెచ్‌ఎం డీడీఎం రుక్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గాజులగట్టు జీపీలో చెక్ పవర్ ఎన్నిక



ఎన్నికైన వార్డుసభ్యులను అభినందిస్తున్న గ్రామస్తులు

గూడూరు: మండలంలోని గాజులగట్టు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం చెక్ పవర్ కోసం సర్పంచ్ స్థానంలో ఒకరిని, ఉప సర్పంచ్ స్థానంలో మరొకరిని నియమించేందుకు ఎన్నిక నిర్వహించారు. జీపీ నిధుల ఖర్చులో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదుతో జిల్లా అధికారులు నెల రోజుల క్రితం సర్పంచ్ వసంతను తొలగిస్తూ.. ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. కాగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి జి.సత్తయ్య గ్రామస్తుల సమక్షంలో వార్డు సభ్యులకు ఎన్నిక నిర్వహించారు. సర్పంచ్ చెక్ పవర్‌కు వార్డు సభ్యురాలు సంగెపు అరుణ, ఉప సర్పంచ్ చెక్ పవర్ కోసం వార్డు సభ్యురాలు జనగం కోమలను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వీరిద్దరికీ గ్రామస్తులు, వార్డు సభ్యులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండీ. యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

తొర్రూరు: పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని సోమారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ సమస్యలపై శిబిరం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌తో కలిసి శిబిరాన్ని శ్రీనివాస్ ప్రారంభించారు. పశువుల సంఖ్య పెంపునకు శిబిరాలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మడపల్లి సంపత్, పశువైద్యాధికారి రాజశేఖర్, ఉప సర్పంచ్ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

● రైలెక్కిన జేసీబీలు..



రోడ్డుపై నడవాల్సిన జేసీబీలు రైలెక్కాయి. గురువారం సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వైపునకు ప్రత్యేకంగా ఓ రైలుపై సుమారు 200వరకు జేసీబీలను తరలించారు. కాగా మానుకోట రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తున్న ఈ రైలును ప్రయాణికులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- మహబూబాబాద్ రూరల్

మానుకోట డిపోకు రికార్డుస్థాయి ఆదాయం

- ఒకే రోజు రూ.12,99,801 రాబడి



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం విజయ్

నెహ్రూసెంటర్: టీఎస్ ఆర్టీసీ మహబూబాబాద్ డిపోకు ఈ నెల 18వ తేదీన రికార్డుస్థాయిలో రూ.12,99,801ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ విజయ్ గురువారం తెలిపారు. బస్సులు 1,8708కిలోమీటర్లు తిరిగాయని, రాష్ట్రంలోని 97డిపోల్లో అత్యధిక ఈపీకే, ఓఆర్ సాధించి మానుకోట డిపో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. సమష్టి కృషితోనే ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ.అజీమొద్దీన్, వీరారెడ్డి, సత్యనారాయణ, ఎస్.చారి, సీఎస్ఎన్ రెడ్డి, సింగారెడ్డి, ఏవీచారి, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ @38శాఖలు



కలెక్టర్ శశాంక చాంబర్



అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ చాంబర్

- రికార్డులు, సామగ్రి సర్దుకుంటున్న అధికారులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ భవనంలో 38 ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సర్దుబాటు చేసినట్లు సీపీఓ సుబ్బారావు గురువారం తెలిపారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఆయా శాఖల కార్యాలయాలను కలెక్టరేట్‌లోకి మార్చుతున్నారు.అధికారులు,సిబ్బంది రికార్డులు, ఇతర సామగ్రిని సర్దుకుంటున్నారు. అన్ని హంగులతో కూడిన కలెక్టరేట్‌లో ఆయా శాఖల కార్యాలయాల ఏర్పాటుతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సామగ్రి సరిచేసుకుంటున్న సిబ్బంది

కార్యాలయాలు ఇలా..

గ్రౌండ్‌ఫ్లోర్‌లో కలెక్టర్ శశాంక చాంబర్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ చాంబర్లతో పాటు సమావేశ మందిరం ఉన్నాయి. అలాగే డీఆర్‌డీఏ (పెన్షన్ విభాగం), అగ్రికల్చర్, వీసీరూం, డీటీఓ, డీపీఆర్‌ఓ, జిల్లా సంక్షేమశాఖ, కలెక్టరేట్ ఏఓ కార్యాలయంతో పాటు ఇతర శాఖలకు గదులు కేటాయించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో డీఆర్‌డీఏ మెప్మా, డీసీఎస్‌ఓ, డీఎంసీఎస్, భూగర్భజలం, ఏడీ మైన్స్, ఎస్సీ కార్పొరేషన్, మత్స్యశాఖ, డీహెచ్‌ఎస్‌ఓ, ఏసీ లేబర్ కార్యాలయం, డీఎంహెచ్‌ఓ, మినిస్టర్ చాంబర్‌తోపాటు పలు శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సెకండ్‌ఫ్లోర్‌లో తూనికలు కొలతల శాఖ, ఎండోమెంట్, డీపీఓ, డీసీఓ, పరిశ్రమల, ఎల్‌డీఎం లాంటి శాఖలు ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

డోర్నకల్: మండలంలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. అమ్మపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. వెంటనే కొనుగోళ్లు పూర్తి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

‘ఐటీ హబ్’కు నిర్లక్ష్యపు వైరస్

- 2013లోనే ఏర్పాటుకు అడుగులు
- 2017లో మొదటి కంపెనీ ప్రారంభం
- ఆరేళ్లలో వచ్చినవి నాలుగు కంపెనీలే..
- మౌలిక వసతుల లేమితో ముందుకు రాని కంపెనీలు



హన్మకొండ చౌరస్తా: వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. 1400పైగా ఐటీ కంపెనీలతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విరాజిల్లుతుంటే.. అంతే చరిత్ర కలిగి రాష్ట్ర రెండో రాజధానిగా చెప్పుకుంటున్న ఓరుగల్లు నగరం మాత్రం కేవలం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. కంపెనీలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పురోగతి లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీకి కేరాఫ్‌గా వరంగల్ మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక స్వస్థలంలో సరైన అవకాశాలు లేక వరంగల్‌కు చెందిన వేల మంది యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హైదరాబాద్, ముంబాయి, బెంగుళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. వరంగల్‌లో ఐటీ కంపెనీలు, స్టార్టప్ కంపెనీల పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.

2013లోనే అడుగులు..

వరంగల్‌కు ఐటీ రంగాన్ని తీసుకురావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంక్షించారు. నగర శివారులోని మడికొండ ప్రాంతంలో ఐటీ కంపెనీలు స్థాపించేందుకు 2013లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ 2014లో 40 ఎకరాల స్థలాన్ని ఐటీ హబ్‌కు అనువుగా గుర్తించింది. అదే సమయంలో మరో 100 ఎకరాలు అవసరమని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, ప్రభుత్వాలు మారడంతో ప్రతిపాదనలు మూలకుపడ్డాయి.

2017లో మొదటి కంపెనీ..

2014లో ఐటీ పార్కుకు అడుగులు పడగా మూడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత 2017 జనవరి 22న మొదటి ఐటీ కంపెనీ సీయెంట్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నాలుగెకరాల స్థలంలో కొనసాగుతున్న ఈ కంపెనీలో ప్రస్తుతం 250 వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యానుఫ్యాక్చరింగ్, టెలీ కమ్యూనికేషన్ సేవలను సీయెంట్ కంపెనీ అందిస్తోంది.

మౌలిక వసతులు కల్పిస్తేనే..

కొత్త కంపెనీలు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మౌలిక వసతులు లేకపోవడం. పార్కులో రోడ్లు, డ్రైనేజీ, నీటి వనరులు లేకపోవడం వల్లే కొత్త కంపెనీలు ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికితోడు మొదట్లో గజానికి రూ.700 ధర నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ.2000 చొప్పున వసూలు చేస్తూ కేవలం 30 ఏళ్ల లీజు నిబంధన పెట్టింది. దీంతో కంపెనీలు వెనుకడుగు వేస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

ఆరేళ్లలో వచ్చినవి నాలుగే..

హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పిన పాలకులు చేతల్లో విఫలమయ్యారనే విమర్శలు ఘాటుగా వినిపిస్తున్నాయి. గడిచిన ఆరేళ్లలో నగరానికి కేవలం మూడు ఐటీ కంపెనీలే వచ్చాయి. అందులో ఒకటి సీయెంట్ కాగా వెంటాయిస్, కాకతీయ టెక్నాలజీ కంపెనీలతో పాటు టెక్ మహీంద్ర కంపెనీ మడికొండ ఐటీ పార్కులో నిర్మాణంలో ఉన్న ఇంక్యుబేషన్ టవర్‌లో కొనసాగుతుంది. వీటి తర్వాత ఏ ఒక్క కార్పొరేట్ ఐటీ కంపెనీ కూడా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సుముఖత చూపలేదు.

వరంగల్‌పై సవతి తల్లి ప్రేమ..



త్వరలో వరంగల్ నగరానికి ఐటీ దిగ్గజ కంపెనీలు వస్తాయని వేదికలపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయి. వరంగల్‌పై కేసీఆర్ సర్కార్‌ది కేవలం సవతి తల్లి ప్రేమే అని తేలిపోయింది. అందుకు నగరంలో నడుస్తున్న నాలుగు కంపెనీలే ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఐటీ పార్కులో వసతులు కల్పించి కొత్త కంపెనీలను తీసుకురావాలి.

– పుల్లూరు సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు

ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి



వరంగల్ నగరంలో 30 నుంచి 40 వరకు స్టార్టప్ కంపెనీలు ఉన్నాయి. వాటికి ప్రభుత్వం తరఫున ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి. జీఎస్టీలో రీయింబర్స్‌మెంట్, రాయితీపై రుణాలు, ఐటీ పార్కు లీజు కాలాన్ని మరింత పెంచి ధరను తగ్గించి స్టార్టప్ కంపెనీలకు ఇవ్వాలి. ప్రభుత్వ ప్రాజెక్టులలో స్టార్టప్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలి.

– ఆడెపు వెంకటేశ్, ఎస్‌వీ యాప్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ చైర్మన్, హనుమకొండ

క్లుప్తంగా

టేకు కలపతో భార్య ప్రతిమ



టేకు కలపతో రూపొందించిన పకిరిబాయి ప్రతిమ

కురవి: చనిపోయిన భార్యకు గుర్తుగా ఆమె విగ్రహం తయారు చేయించడం చూస్తుంటాం. కానీ టేకు కలపతో భార్య ప్రతిమ చేయించాడు ఓ భర్త. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండాకు చెందిన జాటోత్ వాల్యా.. భార్య పకిరిబాయి గత ఏడాది చనిపోయింది. ఆమెపై ఉన్న ప్రేమకు గుర్తుగా భర్త.. పకిరిబాయి ప్రతిమను టేకు కలపతో చేయించాడు. ఎడ్లబండిలో ఉన్నట్లు చెక్కించి ఇంట్లో ప్రతిష్ఠించాడు. కాగా, గురువారం వాల్యాను మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించి పకిరిబాయి ప్రతిమను ఆసక్తిగా తిలకించారు.

కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్య

హసన్‌పర్తి: కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెందిన పెద్దమ్మ సాంబలక్ష్మి(65)కి ఇద్దరు కుమారులు రవి, గణేష్ ఉన్నారు. సాంబలక్ష్మి పెద్ద కుమారుడు రవి వద్ద ఉంటుంది. గణేష్ అద్దె ఇంటిలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పెద్ద కుమారుడు రవి, తల్లి సాంబలక్ష్మికి మధ్య గొడవ జరిగింది. దీంతో మానసిక వేదనకు గురైన సాంబలక్ష్మి బాత్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

9మందిపై చీటింగ్ కేసు నమోదు

ఖిలా వరంగల్: వాహనాల నంబర్ ప్లేట్లపై స్టిక్కర్ అతికించి, నంబర్లు కనిపించకుండా ట్యాంపరింగ్‌కు పాల్పడిన తొమ్మిది మంది వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఎస్సైలు రాజబాబు, డేవిడ్, ఆర్‌ఎస్సైలు పూర్ణచందర్ రెడ్డి, శ్రవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. హుండీ తాళాన్ని తొలగించి పక్కనే ఉన్న చెరువు కట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ గొడ్డలి సాయంతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లిన అర్చకులు హుండీ చోరీకి గురైనట్లు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తిరుపతి చేరుకొని క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని హుండీ, గొడ్డలిపై ఉన్న వేలిముద్రలు సేకరించారు. జాగిలంతో ఆలయ ప్రాంగణంతో పాటు చెరువు కట్టపై వెతికారు. కాగా, పక్కనే ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న వారు బయటకు రాకుండా దొంగలు బయటి నుంచి గొళ్లెం పెట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో రెండుసార్లు ఇదే ఆలయంలో హుండీ చోరీకి గురైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్ మృతి

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా నరేష్ విధులు
- ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత, అంతలోనే విషాదం



నరేష్ (ఫైల్)

నడికూడ: రోడ్డు ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పరకాల పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి నరేష్(28) ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ జిల్లాలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితం ఎస్సై ఈవెంట్స్ కోసం సెలువుపై గ్రామానికి వచ్చాడు. ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత కూడా సాధించాడు. గురువారం బైక్‌పై వెళ్లి చర్లపల్లిలోని బంధువులను కలిశాడు. అక్కడ నుంచి పులిగిల్లలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చర్లపల్లి గ్రామ శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల పోలీసులు తెలిపారు. హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ తల్లిని ఓదార్చారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..



మల్లయ్య మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లయ్య(60) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రవినగర్ శివారు మంగళికుంట సమీపంలో మల్లయ్యకు ఎకరం పొలం ఉంది. గురువారం పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న బోరు మోటార్ తీగ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

స్టార్టర్ ఆన్ చేస్తూ మరొకరు..



రవి మృతదేహం

కురవి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బంచరాయితండాకు చెందిన బానోత్ రవి(40) అనే రైతు అదే గ్రామానికి చెందిన నారాయణ అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం ఏటి ఒడ్డున ఉన్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడి కొట్టుకుంటుండగా పక్క పొలం రైతులు, తండావాసులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రవిని వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై ఎస్సై బి.రామును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెరువులో పడి మహిళ..

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందిన చెరుకుల సూరమ్మ(52) గ్రామ సమీపంలోని పెద్దచెరువులో పడి మృతి చెందింది. ఏఎస్సై అబ్బయ్య కథనం ప్రకారం.. కొంతకాలంగా సూరమ్మ మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తిస్తోంది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఇంటి నుంచి వెళ్లి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో ఉండి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేది. దీంతో ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, తిమ్మంపేటకు చెందిన రైతు గుండు నర్సయ్య గురువారం చెరువు వద్దకు వెళ్లగా నీటిలో మహిళ మృతదేహం కనిపించింది. విషయాన్ని బాలన్నగూడెం గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు చేరుకుని సూరమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మిర్చి కల్లంలో కూలీగా..



వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి గురువారం శాయంపేట మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లికి వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి–నిజాంపల్లి శివారులో మిర్చి ఏరుతున్న కూలీలను చూసి వాహనాన్ని ఆపారు. కూలీలతో కలిసి కొంతసేపు తాలు మిర్చి ఏరి మహిళా కూలీల బాగోగులు తెలుసుకున్నారు.

– టేకుమట్ల(రేగొండ)

ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్నమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

హన్మకొండ: ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసుకుంటే 6 లక్షలకు పైగా వచ్చారని, నాలుగు గంటలు వేచిఉండి సీఎం కేసీఆర్, వచ్చిన అతిథిలు ప్రసంగాలు ఓపికగా విన్నారని, సభాస్థలి బయట లక్షన్నర మంది ఉండిపోయారన్నారు. సభకు తరలివచ్చిన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా సీఎం కేసీఆర్ వైపు చూస్తుందని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరుకుంటున్నారన్నారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సభను చూసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిచ్చి కూతలు కూస్తున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని తూర్పారబట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని అద్దాలు పెట్టుకుని చూస్తే ఇక్కడి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కనిపిస్తాయన్నారు. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఖమ్మం బీఆర్ఎస్ సభ కొత్త చరిత్రకు నాంది అని అన్నారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, మేయర్ గుండు సుధారాణి, నాయకులు లలితా యాదవ్, గాంధీ నాయక్, యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు అమరాజు స్వామి కథనం ప్రకారం.. చెన్నారం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరు కాగా, అమరాజు స్వామి కుటుంబ సభ్యులు పాల్గొని ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో వీధి కుక్కలు వెంట పడడంతో పరిగెత్తి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గొర్రెల షెడ్డులోకి వెళ్లిన వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేయడంతో 7 మృతి చెందాయి. దీంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయాడు. గ్రామంలో కుక్కల బెడద ఉందని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని కోరాడు.

ధర్మకర్తల మండలి నియామక జీఓ సస్పెన్షన్

- 11న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- కోర్టు వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

ఐనవోలు: ఐనవోలు ఆలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వుల జీఓ నంబర్ 11ను సస్పెన్షన్ చేస్తూ ఈ నెల 11న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, హైకోర్టుకు సెలవులు ఉండడంతో ఉత్తర్వుల ప్రతులు బుధవారం రాత్రి హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకానికి డిసెంబర్ 15న నోటిఫికేషన్ వెలువడింది. 20 రోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జనవరి 5తో గడువు ముగియడంతో ఈ నెల 10న ఎండోమెంట్ కమిషనర్ 14 మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన పైల శ్రీనివాసులు అనే వ్యక్తి నియమ నిబంధనలు పాటించకుండా ఎండోమెంట్ కమిషనర్ జీఓ 11 వెలువరించారని, జీఓను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 11న జీఓను సస్పెన్షన్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులు ఫిబ్రవరి 8 వరకు కౌంటర్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఆరుగురి నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

మహదేవపూర్: ఛత్తీస్‌గఢ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న కాళేశ్వరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పల్సర్ బైక్ వచ్చిన షారుక్‌ఖాన్, మారెపల్లి మల్లేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాలు చేశారు. వారి వద్ద 1,300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తీసుకెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చేరుకోగానే షారుక్‌ఖాన్ పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో ఎస్పీ సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈనెల 18న పలిమెల మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా షారుక్‌ఖాన్‌తో పాటు పేరుక రాజకుమార్, సడల సురేందర్, జన్నే రాజశేఖర్, ఆముదాల కార్తీక్ గంజాయితో పట్టుబడ్డారు. విచారణలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన చాందినీఖాన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు ఆమె వద్ద సుమారు 2 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండి షారుక్‌ఖాన్, గణపురం మండలం చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, పేరుక రాజకుమార్, కొంపల్లికి చెందిన సడల సురేందర్, గొర్లవీడుకు చెందిన జన్నే రాజశేఖర్, బీజాపూర్‌కు చెందిన చాందినీ ఖాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్, రాజ్‌కుమార్, ఏఎస్సైలు మల్లేశ్వర్, నాగయ్య, పీసీలు బాల్‌సింగ్, కిరణ్, సంతోష్, ధనుంజయ్, సమ్మయ్య, దేవేందర్, శ్యామ్, తిరుపతి, అన్వేష్, వేణు, లావణ్య, శిరీష, స్వాతిలను డీఎస్పీ అభినందించారు.

జీపీ స్థల విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు
- బుర్రకాయలగూడెంలో ఘటన





గాయపడిన నాను, రవీందర్

గణపురం: నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం వారు మరో వర్గంపై కత్తులతో దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుర్రకాయలగూడెంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. బుర్రకాయలగూడెం జీపీ భవన నిర్మాణం కోసం తహసీల్దార్ సతీష్‌కుమార్ 10 గుంటల భూమి కేటాయించారు. భవన నిర్మాణాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం(నేడు) ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో గురువారం శిలాఫలకం పనులు చేస్తుండగా స్థలం తమదంటూ ఎంపీటీసీ కాలియా సాగర్, ప్రవీణ్, శ్రీబాబు, కాలియా గోపాల్ అడ్డుకున్నారు. పనులు చేయిస్తున్న తుమ్మల నాను, తుమ్మల రవీందర్‌తో గొడవకు దిగి కత్తులతో దాడి చేశారు. దీంతో నాను, రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్, ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట: అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన గోపగాని సాయిచరణ్ ఈ నెల 15న తన పల్సర్ బైక్‌పై చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో గల అత్తగారింటి నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. పార్క్‌లైన్ వైన్ షాపు వద్దకు రాగానే నర్సంపేటకు చెందిన గ్యార శ్రీకాంత్ తన ఎర్టిగా వాహనంతో వేగంగా దూసుకొచ్చి అకస్మాత్తుగా రోడ్డుపై ఆపాడు. దీంతో పల్సర్ బండిపై వస్తున్న సాయిచరణ్ కారును ఢీకొట్టి కిందపడిపోయాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా వాహనం నడిపిన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.